ప్రజాశక్తి
మంగళవారం 3 జూన్ 2025
5
విజయనగరం

పంచాయతీ కార్యదర్శులకు బదిలీ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పలువురు పంచాయితీ కార్యదర్శులు బదిలీ కానున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంచాయితీ కార్యదర్శులకు సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనల మేరకు గ్రేడ్ 3 పంచాయితీ కార్యదర్శులు 18 మంది, గ్రేడ్ 4 కార్యదర్శులు 61 మంది, గ్రేడ్ 5 కార్యదర్శులు 116 మంది బదిలీకి అర్హులుగా నిర్ణయించి, వీరికి కౌన్సిలింగ్ పూర్తి చేశారు. అదేవిధంగా ముగ్గురు డిప్యుటీ ఎంపిడిఒలు (ఇఒపిఆర్‌డిలు) కూడా బదిలీ కానున్నారు. వీరందరికీ డిఆర్‌ఒ మురళి, జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వర్రావు కౌన్సింగ్ నిర్వహించి, కొత్త ప్రాంతాలను కేటాయించారు.

ఏం.. డ్రామాలాడుతున్నారా?

- నాపైనే దుష్ప్రచారం చేస్తారా ?
- నాకు తెలియకుండానే కలెక్టరేట్‌లో సమావేశాలా?
- ముగ్గురు అధికారులు వేర్వేరు కారణాలతో సెలవులు పెడితే వేధింపులు అంటారా?
- నా వేధింపుల వల్లే అధికారులు సెలవుల్లో వెళ్లారని మంత్రి అన్నారంట!
- నా అనుమతి లేకుండా మంత్రులు, ఎమ్మెల్యేలను కలిస్తే చర్యలు
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ అంబేద్కర్ మండిపాటు

ఎస్ఎస్ఎ ఏపీసీ..నీకు చాలా సార్లు అవకాశం ఇచ్చా.. నీవు ఎన్ని చేసినా భరించాను.. ఎవరి పరిమితులు వారికి ఉంటాయి. నీకు అంత పబ్లిసిటీ పిచ్చా... నీవు ఏదో బుక్ రాశావు.. మంత్రితో ఓపెన్ చేయించావు..నీ మేధాశక్తిని తెలియజేయాలంటే యూనివర్సిటీలో పాఠాలు చెప్పుకో..!

అగ్రికల్చర్ జేడీ నీకేమైంది? సమావేశం పెట్టేటప్పుడు కలెక్టర్‌కు చెప్పాలని లేదా.?

నాపై దుష్ప్రచారం చేస్తారా ? నాకు తెలియకుండానే కలెక్టరేట్ లో సమావేశాలు పెడతారా..? ముగ్గురు అధికారులు వేర్వేరు కారణాలతో సెలవులు పెడితే వేధింపులు అంటారా.?

నా వేధింపుల వల్లే అధికారులు సెలవుల్లో వెళ్లారని గౌరవ మంత్రి అన్నారంట! నా అనుమతి లేకుండా మంత్రులు, ఎమ్మెల్యేలను కలిస్తే చర్యలు తీసుకుంటాను.

- పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ వ్యాఖ్యలివి.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సమావేశంలో జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ కొందరు అధికారులనుద్దేశించి ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా అధికారులు మంత్రులు, ఎమ్మెల్యేలను కలవాలంటే తన పర్మిషన్ తీసుకోవాలని ఆదేశించారు. 'నేను పర్మిషన్ ఇస్తేనే మీరు వెళ్లాలి... నా అనుమతి లేకుండా మంత్రులనుగాని ఎమ్మెల్యేలను గాని కలవడానికి వీల్లేదు..., నేను వద్దంటే కలెక్టర్ వద్దన్నారని చెప్పుకోండి. అంతేగాని ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో మీ సొంత నిర్ణయాలు తీసుకుంటే ఇక నుంచి ఊరుకునేది లేదు' అంటూ అధికారులకు చురకలందించారు. 'కలెక్టర్ గైడ్ లైన్స్ మీకు తెలియజేయాలా.. నా మంచితనాన్ని చేతగానితనంగా తీసుకుంటారా..? కలెక్టర్ రూల్స్ చదవండి.. డ్రామాలాడితే ఊరుకునేది లేదు' అంటూ హెచ్చరించారు.

'గౌరవ మంత్రి గారు నా వేధింపులు తట్టుకోలేక డిఆర్‌ఒ, ఆర్‌డిఒ, తహాశీల్దార్ సెలవుపై వెళ్లారని దుష్ప్రచారం చేస్తున్నారు... గౌరవ మంత్రి గారే డిఆర్‌ఒ మురళితో చెప్పారంట... డిఆర్ఒనే సాక్షం... మీ కలెక్టర్ వేధింపులు వల్లే ఈ ముగ్గురూ అధికారులూ సెలవుపై వెళ్లిపోయారని.. నేనేమైనా వేధిస్తున్నానా..? మంచిగా ఉండడమే తప్పా..? అని ప్రశ్నించారు. అదిగో.. ఆర్డీవో పెట్టిన మెసేజ్‌ను జిల్లా అధికారుల గ్రూపులో షేర్ చేశాను చూడండి.. ఆమె ఏమని పెట్టారో చూడండి. పిల్లలకు అనారోగ్యం అని చెప్పి మెసేజ్ చేశారు. డిఆర్‌ఒ తన సోదరికి అనారోగ్యం కారణంగా సెలవు కావాలని అడిగితే ఇచ్చాం.. విజయనగరం తహాశీల్దార్ సిక్కింలో కుటుంబ సభ్యులతో కలిసి ఎంజాయ్ చేస్తుంటే ..నేను వేధించానా..? నేను ఇలాగే సెలవులు ఇస్తూ ఉంటే ఇంకా అధికారులను వేధించినట్లుగా గౌరవ మంత్రి గారు దుష్ప్రచారం చేస్తారేమో... అందుకే ఇక నుంచి ఎవరికీ సెలవులు ఇచ్చేది లేదు. అంటూ మండిపడ్డారు.

'ఏం.. ఎపిసి తమాషాలు చేస్తున్నావా..? కలెక్టర్‌కు తెలియకుండా మీటింగ్‌లు పెడతావా..? అంటూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను నాలుగు గోడల మధ్య చెప్పడం లేదు అందరి అధికారుల మధ్య చెబుతున్నాను. 'ఎఒ గారు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం తెరవాలన్న.. మీటింగ్ పెట్టాలన్నా... కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్ నోటి ఫైల్ పై సంతకం లేకుండా ఆడిటోరియం ఓపెన్ చేయడానికి వీలు లేదు' అంటూ హుకుం జారీచేశారు. ఏమనుకుంటున్నారో ఐయాం బాస్ ఆఫ్‌ద కలెక్టరేట్. ఇంకో సారి ఇలా జరిగితే చూస్తూ ఉరుకోను, క్రిమినల్ చర్యలు తీసుకుంటాను అంటూ హెచ్చరించారు. 'నాకు ట్రాన్స్‌ఫర్ ఉంది. అది వారంరోజుల్లో ఉండొచ్చు. నెల కావచ్చు. సంవత్సరం కూడా పట్టొచ్చు. కానీ, కుర్చీల కోసం వేలాడే అధికారిని కాదు సుమా..!. ఎక్కడ ఉద్యోగం ఇచ్చినా చేస్తాను. ఇప్పటికైనా తీరు మారకపోతే నాలో మరో కోణాన్ని చూస్తారు అంటూ వ్యాఖ్యానించారు. కలెక్టర్ ఆగ్రహంతో మాట్లాడడంతో అధికారులంతా బిత్తరపోయారు. ఆడిటోరియం అంతా పిన్‌డ్రాప్ సైలెన్స్‌గా మారిపోయింది.

కలెక్టర్ X మంత్రి

కలెక్టరేట్ వేదికగా బయటపడ్డ విభేదాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్ఎంఇ, ఎన్నార్ై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. ఒకరిపై మరొకరు కౌంటర్ ఎటాక్‌లు ఇచ్చుకునే వరకు వచ్చింది. కారణాలు ఏవైనా, కారకులు ఎవరైనా కొంతకాలంగా ఇద్దరూ ఎడముఖం, పెడముఖంతో ఉంటున్నారు. గడిచిన కొద్దిరోజులుగా ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా ఇద్దరూ కలిసి కనిపించడం తగ్గింది. ఇటువంటి పరిస్థితుల్లో పుండుపై కారం చల్లిన చందాన సమగ్ర శిక్ష ఎపిసి కలెక్టర్‌కు చెప్పండా సాక్షాత్తు కలెక్టరేట్ ఆడిటోరియంలోనే వికలాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం, ఈ కార్యక్రమానికి మంత్రి వస్తున్నట్లు కూడా సమాచారం లేకపోవడంతో కలెక్టర్ ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. మరోవైపు ఇదే కార్యక్రమంలో 'మీ కలెక్టర్ ఒత్తిడి భరించలేకే డిఆర్‌ఒ, ఆర్‌డిఒ, చివరికి విజయనగరం తహాశీల్దార్ కూడా సెలవులోకి వెళ్లిపోయారు' అంటూ మంత్రి సాక్షాత్తు ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ ఇ.మురళికి చెప్పారట. ఈ విషయం కలెక్టర్ వరకు వెళ్లడంతో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఆయన ఓపెన్ అయిపోయారు. 'గౌరవ మంత్రిగారు నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి విజయనగరం తహాశీల్దార్ తన కుటుంబంతో కలిసి సిక్కిం పర్యటనకు వెళ్లారని, ఆయన వరదల్లో చిక్కుకున్న విషయం కూడా తనతోపాటు చాలా మందికి తెలుసునని అన్నారు. డిఆర్‌ఒ తన సోదరి ఆరోగ్యం బాగోలేక సెలవు అడిగారని, ఆర్‌డిఒ తన కొడుకు అనారోగ్యం వల్ల సెలవు పెట్టారని, ఆపదలోవున్న వీరికి సెలవు ఇవ్వడమే తప్పా? అంటూ ప్రశ్నించారు. ఈ ముగ్గురూ తన వేధింపుల వల్ల సెలవు పెట్టారంటూ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. అయితే కలెక్టర్‌పై మంత్రి ఎందుకు అంతలా వ్యాఖ్యలు చేశారు? మంత్రి, కలెక్టర్ మధ్య విభేదాలు ఎందుకు వచ్చాయి? కారణాలేమిటి? అన్నదానిపై చర్చనడుస్తోంది. వీరిద్దరి మధ్య ఇంకా ఇదే పరిస్థితి కొనసాగితే అది జిల్లా అభివృద్ధి, ఇతర కార్యకలాపాలకు తీవ్ర ఆటంకంగా మారే ప్రమాదం ఉంటుందని పలువురు విశ్లేషిస్తున్నారు. దీనిపై మంత్రి ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

కింతలి రేష్మ (58), రసజ్ఞ (78), యోగేశ్వర్ (284), సాయి ప్రియతమ్ (1081), బలరాంనాయుడు (633)

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఇఇ అడ్వాన్సు ఫలితాల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. మెరుగైన ర్యాంకులు సాధించి ఐఐటిల్లో సీట్లు సంపాదించారు. సోమవారం వెలువడిన ఈ ఫలితాల్లో చీపురుపల్లి పట్టణానికి చెందిన కింతలి రేష్మ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 58వ ర్యాంకు సాధించింది. విజయవాడలో ఇంటర్ చదువుకుంది. తల్లిదండ్రులు బుక్ షాపు నడుపుకుంటూ కుమార్తెను చదివించారు. ఇంటర్ విశాఖలోని కెఎంఆర్ కళాశాలలో చదువుకుంది. మంచి ర్యాంకు సాధించడం పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

విజయనగరానికి చెందిన లకినేని సాయి ప్రియతమ్ ఒబిసి కేటగిరిలో 178వ ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో 1081వ ర్యాంకు సాధించాడు. విశాఖపట్నం లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకున్న సాయి ప్రియతమ్ తండ్రి ఎల్‌వి గంగాధర్ ఖజానా కార్యాలయంలో ట్రెజరీ డిపార్టుమెంట్‌లో సీనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి శ్రీవాణి గృహిణి.

యోగేశ్వర్‌కు 284వ ర్యాంకు

రామభద్రపురం : ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన యోగేశ్వర్ అడ్వాన్స్ పరీక్షల్లో ఆలిండియా జనరల్ కేటగిరిలో 284వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరిలో 40వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఇటీవల వెల్లడైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా 853వ ర్యాంకు, ఒబిసి కోటాలో 135వ ర్యాంకు సాధించాడు. విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదువుకున్న యోగేశ్వర్ ఇటీవల తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో 79వ ర్యాంకు సాధించాడు. బాలుడు తండ్రి సాలూరు సత్యసాయి జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తుండగా తల్లి ఎర్రయ్యమ్మ ఒక ప్రైవేటు స్కూల్లో పనిచేస్తున్నారు. ముంబై ఐఐటిలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చేసి సివిల్స్ లో ఉత్తీర్ణత సాధించాలన్నది తన ఆశయమని యోగేశ్వర్ తెలిపాడు.

సత్తా చాటిన రసజ్ఞకు 78వ ర్యాంకు

వీరఘట్టం : మండలంలోని పనస నందివాడకు చెందిన కొరికాన రసజ్ఞ జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా జనరల్ కేటగిరీలో 78వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 8వ ర్యాంకు సాధించింది. ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా 422వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 60వ ర్యాంకు సాధించింది. రసజ్ఞ 9,10 గుడివాడలోని కెకెఆర్ గౌతమ్ స్కూల్‌లో చదువుకుంది. ఇంటర్ విజయవాడలోని చైతన్య కళాశాలలో చదువుకుంది. తల్లిదండ్రులు శ్రీనివాస్, రవణమ్మ వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విజయం తమ గ్రామానికి ఒక గుర్తింపు తెచ్చిందని పనస నందివాడ మాజీ సర్పంచి కొరికాన సన్యాసి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

జెఇఇ అడ్వాన్స్‌లో బలరాం నాయుడుకు 633వ ర్యాంక్

పార్వతీపురం టౌన్ : జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో పట్టణానికి చెందిన ద్వారపురెడ్డి బలరాం నాయుడుకు ఆలిండియా 633, ఒబిసి కోటాలో 98వ ర్యాంకు సాధించాడు. బలరాంనాయుడు తండ్రి ద్వారపుడ్డి తిరుపతినాయుడు కాంట్రాక్టర్ కాగా, తల్లి శకులంత వైద్యురాలు. బలరాంనాయుడు ర్యాంక్ సాధించడం పట్ల ఆయన పెదనాన్నలు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్ హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు, కౌలు, రైతు సంఘాల నాయకులు

భూ యజమాని ఆమోదం లేకున్నా కౌలు కార్డులు ఇవ్వాలి

కలెక్టరేట్ వద్ద కౌలు రైతుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం కౌలు రైతుల 2019 చట్టాన్ని రద్దు చేసి భూ యజమాని ఆమోదం నిబంధన మార్పు చేసి గ్రామ సభ ద్వారా గుర్తించి కౌలు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద కౌలు రైతులు ధర్నా చేశారు. ఈసందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ కౌలు రైతులకు యజమానులు సంతకం కానీ, భూ 1బి గాని, ఆధార్ కానీ ఇవ్వకపోవటం వల్ల అనేక మంది కౌలు కార్డులు, తద్వారా ప్రభుత్వ పెట్టుబడి సాయం, విత్తన రాయితీ, ఇతర సదుపాయాలు పొందలేక పోతున్నారని అన్నారు. రాష్ట్రప్రభుత్వం నిబంధనలు మార్చి గ్రామసభ ద్వారా గుర్తించి కౌలు కార్డులు అందించాలని కోరారు. జామిలో ఇటీవల చనిపోయిన కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ కౌలు రైతులకు ఏటా అన్యాయం జరుగుతోందన్నారు. పూర్తిస్థాయిలో కార్డులు అందజేయడం లేదన్నారు. ధర్నా లో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కౌలు రైతులు సంఘం నాయకులు తొత్తడి పైడిపునాయుడు, సహాయ కార్యదర్శి, కసిరెడ్డి నారాయణరావు, జి.గోవింద రావు, వి.సన్యాసి, కె.సూర్యనారాయణ, వెంకటరావు, బూడి అప్పలనాముడు, కెల్ల సత్యం, రైతులు పాల్గొన్నారు.

రేపు వైసిపి ఆధ్వర్యాన 'వెన్నుపోటు దినం'

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జూన్ 4న జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, పరిశీలకులు కిల్లి సత్యన్నారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గాల మండల పార్టీ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపిని బూత్ లెవల్‌నుంచి సంస్థగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ అడుగులు వేస్తోందన్నారు. గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీ అనుబంధ విభాగ కమిటీలు నియోజకవర్గ సమన్వయకర్త అనుమతితో త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైసిపి నిరసన గళం వినిపిస్తూనే ఉంటుందని అన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4న వెన్నుపోటు దినంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 4న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలతో కలిసి నిరసనలు ఆర్‌డిఒ, తహాశీల్దార్ కార్యాలయాల్లో డిమాండ్ పత్రాలు అందజేస్తామని,చంద్రబాబు చేసిన మోసానికి నిరసనగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనేలా కూడాలని తెలిపారు. సమావేశంలో నియోజవర్గ,మండల పార్టీ అధ్యక్షులు ,కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యోగాంధ్ర అర్బన్ స్థాయి పోటీలను నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సోమవారం ప్రారంభించారు. స్థానిక రాజీవ్ స్టేడియంలో 10 నుండి 18 సంవత్సరాలలోపు బాల బాలికలకు సచివాలయాల పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపిక చేసిన వారితో పోటీలు నిర్వహించి, వారి నుండి అర్బన్ స్థాయి లో 1,2,3 కేటగిరీలో ఎంపిక చేశారు. ఈ పోటీలు ఈనెల రెండో తేదీ నుండి ఏడో తేదీ వరకు జరుగుతాయని సహాయ కమిషనర్ తెలిపారు. వృద్ధులకు పోటీలు నిర్వహించి వారి నుండి అర్బన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపుతా మన్నారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, పీడీలు, పిఇటిలు, యోగా శిక్షకులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వసుధైక కుటుంబం ఏర్పాటుకు దోహదం

యోగా ద్వారా శారీరకంగా మానసికంగా ఏకీకృతం చేసి వసుధైక ఆరోగ్య కుటుంబాన్ని ఏర్పాటు చేసేందుకు యోగాంధ్ర దోహద పడుతుందని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. సోమవారం మెసానిక్ టెంపుల్ వద్ద యోగాసనాలను నిర్వహించారు. అనంతరం మయూరి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు.

నేటి నుంచి గ్రామస్థాయి యోగా శిక్షణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి యోగా శిక్షణా కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమవు తుందని, దీనికి ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ సెల్ వద్ద అధికారులకు జెసి పలు సూచనలు చేశారు. ప్రతీ సచివాలయానికి 9 మంది యోగా శిక్షకులను ఎంపిక చేశామని, వీరి ద్వారా 3వ తేదీ నుంచి ఒక్కో బ్యాచ్‌కు 70 మంది చొప్పున 3 రోజుల యోగా శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారిని మాత్రమే యోగా శిక్షకులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. జూన్ 15 వరకు బ్యాచ్‌లు వారీగా శిక్షణా కార్యక్రమం జరుగుతుందని, గ్రామంలోని దాదాపు అందరికీ యోగా శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రజలనుంచి వినతులను స్వీకరించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయ స్థాయిలో నిర్వహించే 1100 కాల్ సెంటర్ సేవలు ప్రారంభం కానున్నాయని జెసి వెల్లడించారు.

సురక్షితంగా గాంగ్‌టక్ చేరుకున్న తహాశీల్దార్ కుటుంబం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సిక్కిం పర్యటనలో వరదల్లో చిక్కుకున్న తమ కుటుంబం సురక్షితంగా రాజధాని గాంగ్ టక్ నగరానికి చేరుకున్నట్టు విజయనగరం తహాశీల్దార్ కూర్మనాధరావు ఫోన్ ద్వారా తెలిపారు. సిక్కింలోని లాఛోంగ్ నుంచి 130 కిలోమీటర్ల దూరంలోని గ్యాంగ్ టక్ కు ఆర్మీ, అక్కడి పోలీసుల సహాయంతో చేరుకున్నట్టు వివరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎపి భవన్ ప్రత్యేక కమిషనర్ ఆర్జా శ్రీకాంత్ సిక్కిం రాష్ట్ర అధికారులతో మాట్లాడి తన కుటుంబం తరలింపులో చొరవ చూపడంతో సురక్షితంగా చేరుకోగలిగామన్నారు. సిఎంఒ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ తదితర అధికారులు తన కుటుంబం సురక్షితంగా చేరుకోవడంలో ఎంతో సహకరించారని వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. జూన్ 6వ తేదీన చండీఘడ్ సమీపంలోని బాగ్దాస్ ఎయిర్‌పోర్టు మీదుగా విశాఖ చేరుకుంటామని పేర్కొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 143 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కంటోన్మెంట్

ప్రజా వినతుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులు పరిష్కారం చేసేటపుడు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని పద్ధతులను పాటిస్తూ వాటిని పరిష్కరిస్తున్నారా లేదా అనే అంశంపై వినతుల ఆడిట్ పూర్తిచేయాలని చెప్పారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 143 వినతులు వచ్చాయి. కలెక్టర్ అంబేద్కర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సేదుమాధవన్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డిఆర్‌ఒ, మురళీ, డిప్యూటీ కలెక్టర్‌లు సవరమ్మ, వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల దోపిడీని అడ్డుకోండి : ఎస్ఎఫ్ఐ

: కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతి అందజేశారు. జిల్లాలో విద్యా హక్కు చట్టాన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు తుంగలో తొక్కుతున్నాయని తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వం ముద్రించిన పుస్తకాలు ద్వారా మాత్రమే చదువు చెప్పాలని నిబంధన ఉన్నా నేక పాఠశాలలు సొంతంగా పుస్తకాలు ముద్రించి వేలకు వేలు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రధానంగా అన్ని పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులను పేరెంట్స్ కాంటాక్ట్ అయ్యేలా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని కోరారు. డిఇఒ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె .రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి పి రమేష్ , వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై వినతి

కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర బాబు, రాష్ట్ర కార్యదర్శి బి.అశోక్ ఆధ్వర్యాన వినతి అందజేశారు.

మండల పరిషత్ అభివృద్ధికి సహకరించని వారిపై చర్యలు తీసుకోవాలి

మండల పరిషత్ సమావేశంలో చర్చించిన అంశాలపై పలుమార్లు అడిగినా సమాచారం ఇవ్వకపోవడం, రికార్డుల టాంపరింగ్‌కు పాల్పడిన ఎంపిడిఒ, నారాయణపురం ఎంపిటిసి నడిమింటి తులసిపై చర్యలు తీసుకోవాలని ఎంపిపి మామిడి అప్పలనాయుడు అధికారులను కోరారు. కలెక్టరేట్‌లో ఈమేరకు వినతి అందజేశారు. సారిక రెవెన్యూలో నవరత్నాలు ,పేదలందరికీ ఇళ్లకు భూసేకరణకు సంబంధించి బినామీ రైతులు పేరిట కొన్ని కోట్ల రూపాయలు అవినీతి జరిగిందన్నారు. ఎంపిడిఒ ద్వారా వీటికి సంబంధించిన వివరాలను పలు నూర్లు అడిగినా ఇవ్వకుండా మండల పరిషత్‌ను అవమాని పరుస్తున్నారన్నారు. సారిక పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాల దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలని జాయింట్ కలెక్టర్‌కు వినతినిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్పీడ్ బ్రేకర్లు వేయండి

నగరంలోని కామాక్షి నగర్ శ్రీ చైతన్య స్కూల్ వద్ద అయ్యన్నపేట జంక్షన్ వద్ద తరుచుగా వాహనాల ప్రమాదాల వల్ల చాలా మంది గాయపడుతున్నారని, కావున వెంటనే స్పీడ్‌బ్రేకర్ వేయాలని అధికారులకు అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు(బాలు), జనసేన నాయకులు పిడుగు సతీష్ వినతిపత్రం అందించారు.

బాధితుల సమస్యలు వింటున్న ఎస్‌పి వకుల్‌జిందాల్, ఎఎస్‌పి సౌమ్యలత

వినతులకు తక్షణ పరిష్కారం

ప్రజల నుంచి వచ్చిన వినతులకు తక్షణ పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం 32 ఫిర్యాదులను స్వీకరించగా, వాటిలో భూ తగాదాలకు సంబంధించి 11, కుటుంబ కలహాలకు సంబంధించి 2, మోసాలకు పాల్పడినట్లు 2,ఇతర అంశాలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: పోస్టల్ శాఖకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న జెసి

చింతపల్లి బీచ్‌ను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

చింతపల్లి సముద్ర తీరాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సోమవారం పరిశీలించారు. పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6న చింతపల్లి బీచ్‌లో మెగా యోగా ప్రదర్శన జరగనుంది. ఈ కార్యక్రమం కోసం ఆయన సముద్ర తీరాన్ని పరిశీలించారు. వేదిక ఏర్పాటు, యోగా ప్రదర్శన స్థలం తదితర ప్రదేశాలను గుర్తించారు. అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. ఈ పర్యటనలో తాహశీల్దార్ తాడ్డి గోవింద, ఎంపిడిఒ రాధిక, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖకు కేటాయించిన భూమిని పరిశీలన

భోగాపురం: పోస్టల్ శాఖకు కేటాయించిన భూమిని జెసి సేతు మాధవన్ సోమవారం పరిశీలించారు. విమానాశ్రయం నిర్మాణం నేపథ్యంలో కార్గో సేవలతో పాటు భోగాపురం పోస్టల్ కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం తహశీల్దార్ కార్యాలయం సమీపంలో భూమిని కేటాయించింది. ఈ భూమిని పోస్టల్ శాఖకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆయన పరిశీలించారు. భూమికి సంబంధించిన వివరాలను తహశీల్దార్ సురేష్, మండల సర్వేయర్ మధుకేశ్వరరావు జెసికి వివరించారు. డిప్యూటీ తహశీల్దర్ హరిన్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

కూటమి ప్రభుత్వం సంవత్సర పాలనలో ఒక్క హామీ కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైసిపి నాయకులు, జెడ్‌పిటిసి గార తవుడు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జూన్ 4 నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ అబద్ధపు హామీలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బెల్లాన త్రినాధ్‌రావు, కరణం ఆదినారాయణ, కర్రీ రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు హాజరైన యాత్రికులు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరులో గత రెండు రోజులుగా గుండాలమ్మ, పైడమ్మ పేరంటాలు, శ్రీకృష్ణస్వామి విగ్రహాలు ప్రతిష్ట వైభవంగా జరుగుతున్నాయి. భయటో భజన కార్యక్రమాలతో పాటు అగ్ని హోమాలు, తప్పెట గుళ్ళు మధ్య విగ్రహ ప్రతిష్టను సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్ధ చిన్నమ్ములు దంపతులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటి నుండి అమలు చేస్తారో తెలపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం తహశీల్దార్ యం శ్రీనుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం అవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, మండల కార్యదర్శి తాడంగి ఎండుదొర, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు సత్యనారాయణ, జి తవుడు పాల్గొన్నారు.

గోతులతో చెరువును తలపిస్తున్న పూల్‌బాగ్ రోడ్డు

బాబోయ్.. పూల్ బాగ్ రోడ్డు

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని పూల్ బాగ్ రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయం జంక్షన్ వరకు బైపాస్ రోడ్డు అధ్వాన్నంగా మారింది. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. గోతులలో వరదనీరు చేరడంతో చెరు వులను తలపిస్తున్నాయి. గోతులలో ద్విచక్ర వాహనదారులు దిగడంతో ప్రమాదాలు జరుగు తున్నాయి. రోడ్డు బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నా అధికార యంత్రా ంగం పట్టించుకోవడం లేదు. ఆర్‌టిసి కాంప్లెక్స్, రాజా కళాశాల, పూల్ బాగ్ వద్ద, గొల్లవీధి జంక్షన్ నుంచి దాడితల్లి ఆలయం వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉన్నాయి. ఇదే మార్గంలో బలిజిపేట, శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలు, వివిధ కళాశాలల విద్యార్థులు రాకపోకలు చేస్తుంటారు. రోడ్డు పాడైపోవడంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతు న్నారు. ప్రభుత్వం స్పందించి నూతన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని పెద్ద మజ్జిపాలెం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ పల్లవి ఆధ్వర్యంలో సోమవారం పలు గ్రామాలలో మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. జూన్ మాసంలో మలేరియా ఎక్కువగా వచ్చే అవ కాశం ఉందని గ్రామస్తులకు వివరించారు. మలేరియా, డెంగీ, చికెన్ గునియా, బోధవ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల వృద్ధి తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలన్నారు. జూన్ 1 నుండి 30 వరకు మలేరియా పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం డీకే పర్తి పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో తిరిగి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ తిరుపతి, ఎంఎల్ హెచ్‌పి ఎస్ లావణ్య, ఏఎన్ఎం దేవి, హెచ్ ఎస్ ఈశ్వరరావు, ఆశాలు సింహాచలం పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం మండలం పడాల పేట గ్రామంలో యువతి ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లి పట్టణానికి చెందిన నడిపేనా భారతి రెడ్డి ల్యాబ్ లో పని చేస్తూ పడాల పెట గ్రామంలో అద్దెకు నివాసం ఉంటోంది.ఉద్యోగం పర్మినెంట్ కాకపోవడం, విధుల్లో ఒత్తిడి వల్ల ఇంట్లో ఫ్యాన్ కు ఉరివేసుకుంది. స్థానికులు సోమవారం ఉదయం బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలు తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అ'ధనం' కష్టమే.!

- నిధులు లేమితో కదలని అదనపు భవనాల నిర్మాణం
- కూటమి ప్రభుత్వం కనికరించేనా?
- మరో పది రోజుల్లోనే ప్రారంభం కానున్న పాఠశాలలు
- ఈ ఏడాదీ అవే కష్టాలు

ప్రజాశక్తి - వేపాడ

గత ప్రభుత్వం హయాంలో పాఠశాలల్లో తరగతి గదులు చాల్లేదని గుర్తించి అదనపు భవనాలను మంజూరు చేశారు. చాలా చోట్ల అదనపు భవనాలు నిర్మాణాలు పూర్తయినా కొన్ని చోట్ల మాత్రం నిధులు చాలక నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేశారు. దీంతో ఈ ఏడాది కూడా విద్యార్థులకు అవే కష్టాలు పునరావృతం కానున్నాయి. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తప్ప మధ్యలో ఆగిపోయిన పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఒక వేళ ఇప్పటికిప్పడే నిధులు మంజూరైన మరో పది రోజుల్లో పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు. కాగా ఈ నెల 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పున ప్రారంభం కానున్నాయి. ఫలితంగా పిల్లలు మళ్లీ ఇరుకు గదుల్లోనే ఈ ఏడాది విద్యా సంవత్సరాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది.

మండలం బక్కునాయుడుపేట వద్ద గల కస్తూరిబా బాలికల వసతి గృహంలో మొదటి విడత నాడు నేడు నిధుల

నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన కెజిబివి అదనపు భవనం

మంజూరుతో కొన్ని అదనపు భవనాల పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన భవనాలకు నిధులు చాలక నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. దుంగాడ ప్రాథమిక పాఠశాలలో కూడా అదనపు భవనం నిర్మాణం పూర్తికాలేదు. దీంతో ఈ ఏడాది కూడా బాలికలకు ఇరుకు గదుల్లోనే పాఠాలు తప్పేలా కనిపించడం లేదు.

వసతి గృహంలో బాలికలు ఇరుకుగా ఉన్న గదులలో చదవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని అధికారులు గుర్తించి అదనపు భవనాల నిర్మాణం అవసరమని జిల్లా సర్వ శిక్ష అభియాన్ ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో కొన్ని గదుల నిర్మాణం పూర్తి అయినప్పటికీ విద్యుత్ సౌకర్యం, కిటికీలకు, తలుపులు బిగించలేదు. గచ్చులు కూడా చేయలేదు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు అదనపు గది నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ పూర్తిస్థాయిలో పనులు జరగకుండా మధ్యలో నిలిపివేశారు. గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో చేసిన పనులకు కూడా సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టర్లు పనులు మధ్యలో నిలిపివేశారు. ఈ ప్రభుత్వమైనా ప్రత్యేక దృష్టి సారించి మధ్యలో నిలిచిన అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో జరిగే విధంగా నిధులు మంజూరు చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముఠా కార్మికుల చర్చలు సఫలం

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలో కుమ్మరవీధి రామకోవెలలో ముఠా వర్కర్స్ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో జరిగిన అగ్రిమెంట్ చర్చలు విజయవంతమయ్యాయి. ఒప్పందం ప్రకారం కూలి రేటు, షరతులు, పాత రేట్‌కి 30శాతం పెంచినట్లు ప్రకటించారు. ఈ అగ్రిమెంట్ తేదీ 2-6-2025 నుంచి 2-6-2027 వరకు అమల్లో ఉంటుందన్నారు. కొత్త అగ్రిమెంటు పాత అగ్రిమెంట్ సమయం పూర్తి అయిన తర్వాత సామరస్యంగా పరిష్కరించుకునేందుకు అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, పాల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణ మూర్తి, మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.తాత, సెక్రటరీ విన్ను కోట గౌతమ్, కొండబాబు, కొల్ల సత్యనారాయణ, విజయ్, ముఠా వర్కర్స్, యూనియన్ కార్యదర్శి జక్కన్న, చిన్న, అధ్యక్షులు దావాలా మహేష్ పాల్గొన్నారు.

కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జూట్ మిల్ రిటైర్డు కార్మికులకు లేబరు కోర్టు తీర్పు మేరకు యాజమాన్యం గ్రాట్యూటీ చెల్లింపులు చేయాలని బిజెపి మండల అధ్యక్షులు మైపాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల తహశీల్దార్ సుదర్శన రావుకి సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావుతో కలిసి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13 మంది కార్మికులకు తక్షణ గ్యాట్యూటీ చెల్లింపులు చేయాలని ఎడాదిన్నర కిందటే లేబరు కోర్టు తీర్పు ఇచ్చినా యాజమాన్యం చెల్లింపులు చేయకుండా తాత్సారం చేస్తోందని చెప్పారు. దీనిపై కార్మికులు రెండు సార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌కి వెళ్లినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. మండల మేజిస్ట్రేట్‌గా లేబరు కోర్టు ఆదేశాలు పాటించని మిల్లు యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ మిల్లు యాజమాన్యాన్ని శనివారం పిలుపించి వివరణ కోరుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురాల సూర్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కెఆర్‌పేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ సోమవారం పరిశీలించారు. ముందుగా వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. తప్పనిసరిగా మేట్లు పని ప్రారంభంలోనే మస్తర్లు వేయాలని చెప్పారు.

గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు

●ఎంఆర్‌పి కంటే అదనపు వసూళ్లు ● ఎరులైపారుతున్న మద్యం ●పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. 34 గ్రామ పంచాయతీల్లో గల్లీకి ఒకటి, రెండు బెల్ట్ షాపులు చెప్పున ఉన్నాయి. గ్రామాల్లో మద్యం విక్రయాలు అధికంగా జరగడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. ఉదయం నుండి రాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగడంతో బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారుతుంది. బెల్ట్ షాప్‌లు లేవని అధికారులు చెబుతున్నా అది లెక్కల వరకే పరిమితం అవుతున్నాయి. నూతనంగా ఎక్సైజ్ శాఖ మద్యం పాలసీని తీసుకువచ్చి ఎంఆర్‌పి ధరకే విక్రయించేలా, కల్తీ మద్యం అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదు. దీంతో బెల్ట్ షాపు నిర్వాహకులకు హద్దు లేకుండాపోతుంది. ఫలితంగా వారి వ్యాపారం మూడు క్వార్టర్లు.. ఆరు బీర్లుగా కొనసాగుతోంది.

ఎనీ టైమ్ మద్యం

గ్రామాల్లో అనాధికారకంగా ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపులు అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంటున్నాయి. గ్రామాల్లో కూలీ పనులు చేసుకునే నిరుపేదలు బెల్ట్ షాపులకు అలవాటుపడి కనీసం కూలి పనులకు పోకుండా నిత్యం మద్యం మత్తులో ఉంటున్నారు. మండలంలో ఉన్న ఐదు మద్యం షాపుల నుండి మద్యం కొనుగోలు చేసి గ్రామాలకు తీసుకొని వెళ్ళి ఒక మద్యం బాటల్ పై ఎమ్మార్పీ కంటే రూ.50 అదనంగా వసూళ్లు చేస్తున్నారు. సంబంధిత అధికారులు వసూళ్ల మత్తులో ఉండటంతో పట్టించుకోవడంలేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గల్లీకి ఒక బెల్ట్ షాప్ ఉండడంతో మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి బెల్ట్ షాపులు నియంత్రించాలని మహిళలు కోరుతున్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

ఎవరైనా బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. గ్రామాల్లో వేలంపాటలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో సిబ్బందితో దాడులు నిర్వహిస్తాం. దొరికిన వారిని జైలుకు పంపిస్తాం.

ఆర్‌జైభీమ్ సిఐ, ఎక్సైజ్ పోలీసు స్టేషన్ రాజాం

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం, సిపిఐ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. సోమవారం వారు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పేదలతో కలిసి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వం సుమారు 1400 మంది పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చింది గానీ వాటి నిర్మాణాల కోసం సామగ్రిని తీసుకుని వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇళ్ల

తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న నాయకులు

నిర్మాణం చేసుకోలేకపోతున్నారన్నారు. మరి కొంత మందికి పట్టాలిచ్చినా స్థలాలను చూపించలేదన్నారు. ఇళ్ళు పట్టాలు కొండ ప్రాంతంలో ఇచ్చారాని అక్కడ నీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ కూడా లేకపోవడం నివాసానికి యోగ్యం కాదని అన్నారు. ప్రభుత్వమే వారికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని లేకపోతే వారికి వేరే చోట నగర పంచాయతీ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నా యని రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు కె. పద్మనాభం, పేదలు లత, లక్ష్మి, విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆది నుంచీ ఆదరణ కరువే?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆది నుంచీ టిడిపి మండల పార్టీ నిరాధరణకు గురవుతుంది. 1982లో టిడిపి స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు ఆ పార్టీ నిరధారణకు గురవుతుందని నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 40సంవత్సరాలుగా టిడిపికి వెన్ను దన్నుగా నిలిచి అధికారంలో ఉన్నా లేకపోయినా టిడిపిని నిలబెట్టడానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు అలుపెరగని పోరాటం చేసి రాజకీయ ఉద్దండులను సైతం మట్టి కరిపించి టిడిపిని గెలిపించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అంతటి ఘన చరిత్ర కలిగిన మండల టిడిపికి ఆ పార్టీ పలుమార్లు అధికారం వచ్చినా ఆదరణ మాత్రం కరువవుతుంది. ఎందుకంటే పార్టీ స్థాపన జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు మండలంలో టిడిపికి మెజార్టీ ఇవ్వడంలో ఇక్కడి నాయకులు, కార్యకర్తలు క్రియా శీలక పాత్ర పోషిస్తున్నారు. 1983, 1985, 1994, 1999, 2014, 2024 ఎన్నికల్లో టిడిపి రాష్ట్రంలో అధికారం చేపట్టినా మండలానికి ప్రాధాన్యత లేకుండా పోయింది. ప్రస్తుతం కూడా అధికారం చేపట్టిన టిడిపి అధిష్టానం మండలాన్ని గుర్తించకుండా నిర్లక్ష్యం వహిస్తుందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం మండలానికి ప్రాధాన్యత నిచ్చి ఇక్కడ ఉన్నవారికి జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు ఇచ్చి వారికి అండగా నిలిచిందని, టిడిపి అధిష్టానం మాత్రం మండల టిడిపిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. రామతీర్థం దేవస్థానం ఉదంతంలో నాయకులు, కార్యకర్తలు పార్టీకి అండగా నిలిచి లాఠీ దెబ్బలు, కేసులు కూడా ఎదురుకుంటున్నా సరే టిడిపి అధిష్టానం మాత్రం తగిన గుర్తింపు ఇవ్వలేదు సరి కదా ఎటువంటి అర్హత లేని వారికి నామినేటెడ్ పోస్టులు కట్ట బెట్టడానికి చూడడం ఎంతవరకు సబబని కష్ట పడ్డవారికి కడకాయలు, కూర్చున్న వారికి గుండె కాయలు అన్న చందంగా అధిష్టానం తీరు ఉందని మండల టిడిపిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

మహేశ్వరమ్మకు సత్కారం

ప్రజాశక్తి-రణస్థలం

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం ముక్క పాలవలస పాఠశాల ఉపాధ్యాయరాలు కనకదుర్గ మహేశ్వరమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పశుసంవర్ధిక శాఖ జెడి వైవి రమణ, రణస్థలం మండలం ఎంఇఒ ఎ.త్రినాధరావు మాట్లాడుతూ మహేశ్వరమ్మ, నర్సింహులు దంపతుల సేవలను కొనియాడారు తరువాత ఆ దంపతులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమం లో పలువురు ఉపాధ్యాయలు, కుటుంబం సభ్యులు పాల్గొన్నారు

మహేశ్వరమ్మ దంపతులను సత్కరిస్తున్న టీచర్లు

రేషన్‌కు 3 కిలోమీటర్లు దూరం వెళ్లాలా?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నిత్యావసర సరుకుల కోసం 3 కిలోమీటర్లు దూరం వెళ్ళాలా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని తమ్మాపురం గ్రామంలో 300 రేషన్ లబ్ధిదారులు ఉండగా మధుర గ్రామం ఆల్తి పాలెంలో 100మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారు. గత 20 సంవత్సరాల నుండి తమ్మాపురం కేంద్రంగా రెండు గ్రామాలకు నిత్యావసర సరుకులు అందేవి. అయితే ఇటీవల కాలంలో డీలర్‌గా వ్యవహరించిన వ్యక్తి ఫోర్జరీ కారణంగా అరెస్ట్ అవ్వడంతో సస్పెండ్ అయ్యారు. సదరు డీలర్ స్థానంలో మరొకరిని భర్తీ చేయకుండా డ్వాక్రా సంఘం ప్రతినిధికి రేషన్ పంపిణీ బాధ్యత ఇచ్చారు. ప్రస్తుతం రేషన్ వాహనాలు నిషేదించి కొత్తగా రేషన్ సరుకులు పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో తమ్మాపురం కేంద్రంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సి ఉండగా మధుర గ్రామం ఆల్తి పాలెం కేంద్రంగా రేషన్ డిపో ప్రారంభించారు. దీంతో తమ్మాపురం వాసులు గ్రామానికి 3కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆల్తిపాలెం వెళ్లి సరుకులు ఎలా తీసుకుంటామని ప్రశ్నిస్తున్నారు. గతంలో వాహనం ద్వారా నిత్యావసర సరుకులు అందేవి ఇప్పుడు డిపో ద్వారా అంత దూరం వెళ్లి సరుకులు తీసుకోవాలంటే ఎలా సాధ్యమవుతుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా తమ్మాపురం కేంద్రంగా



తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న యువకులు

రేషన్ సరుకులు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రేషన్ డిపో ఏర్పాటు చేయాలి

తమ్మాపురంలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని యువత తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం తమ్మాపురం యువత రేషన్ డిపో తమ గ్రామంలో ఏర్పాటు చేయాలని, 3 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆల్తి పాలెంలో రేషన్ ఎలా ఏర్పాటు చేస్తారని వినతి పత్రంలో తెలిపారు. మొదటి నుంచి తమ్మాపురం కేంద్రంగా రేషన్ సరుకులు పంపిణీ జరిగేదని ఇప్పుడు కూడా తమ గ్రామం నుంచే రేషన్ పంపిణీ చేయాలని వినతి పత్రంలో కోరారు.

యోగాతో ఆరోగ్యం: మంత్రి

ప్రజాశక్తి- గంట్యాడ

యోగా చేయటం వల్ల ఆరోగ్యం బాగుంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన యోగా కార్యక్రమానికి ఆయన హాజరై ప్రతి ఒక్కరూ యోగాసనాలను వేయాలని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. దీని వల్ల ఆయుష్షు పెరుగు తుందని, ఎటువంటి రోగాలూ సంభవించవని, మేధాశక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి శివాలయం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ రమణమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు భాస్కరనాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాలు మహిళలు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మంత్రి కొండపల్లి

యోగాపై సమావేశం

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఇఒపిఆర్‌డి రవికుమార్ 18 గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈనెల 3 నుండి 16వ తేదీ వరకు గ్రామ సచివాలయాలలో నిర్వహించనున్న యోగా కార్యక్రమాలపై వారికి వివరించారు.

ముగిసిన యోగాంధ్ర

వారం రోజులుగా ఎంపిడిఒ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం సోమవారంతో ముగిసింది. గ్రామాల్లో యోగా కార్యక్రమాల నిర్వహణకు సచివాలయం పరిధిలో ఉన్న సిబ్బందికి మండల స్థాయిలో వారం రోజులు శిక్షణ ఇచ్చారు. వీరు సచివాలయం పరిధిలో ప్రజలకు యోగా నేర్పిస్తారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పి. వెంకట్రావు, ఇఒపిఆర్‌డి రవికుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి కారు వీరంగం

◆పేదల ఇంటిపైకి దూసుకెళ్లిన కారు ◆ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని సన్ స్కూల్ పక్కన గల రామకృష్ణ నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు కారు బీభత్సం సృష్టించింది. రామకృష్ణ నగర్ లో పేదలు ఇళ్లలో నిద్ర పోతున్న వేళ డంపింగ్‌యార్డు మీదుగా 15 అడుగుల ఎత్తునుంచి ఓ కారు పట్నాన సత్యవతి ఇంటి పైకి దూసుకువచ్చింది. దీంతో కారు కింద పట్నాన సత్యవతి (60), గొడ్డు వినయ్ (14), పట్నాన మహేంద్ర (12) ఇరుక్కుపోయారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి కారును పైకి లేపి దాని కింద ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి జిల్లా కేంద్రా సర్వజన ఆస్పత్రికి తరలించారు. వీరిని సోమవారం సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు, నాయకులు ఎం.శాంతమూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ అర్ధరాత్రి పూటుగా మద్యం తాగి కారు

క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు శంకరరావు

నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తక్షణమే అతని లైసెన్సు రద్దు చేసి, కారును సీజ్ చేసి పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బాధితులను కాపాడిన యువకులను అభినందించారు.

గంజాయి తాగుతున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి కంటోన్మెంట్

పట్టణంలోని రామానాయుడు రోడ్డులో కొంతమంది వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లుగా వచ్చిన సమాచారంతో వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసు సిబ్బంది సోమవారం దాడులు చేసి ఇద్దరిని పట్టుకున్నారు. గంజాయి సేవిస్తూ, విక్రయాలకు పాల్పడుతున్న వుడా కాలనీకి చెందిన వజ్జల భరత్ కుమార్, లంకాపట్నంకు చెందిన చిన్న మనోహర్‌లను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 375 గ్రాముల గంజాయి, రూ.350 నగదు స్వాధీనం చేసుకున్నట్లుగా వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

పట్టుబడిన వారితో పోలీసులు

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని బెల్లాం గ్రామం ద్దగరలోని భాష్యం లేఅవుట్‌లో గంజాయి సేవిస్తున్న ఐదుగురును అరెస్టు చేశామని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 1.330 కిలోల గంజాయి, రూ.200 నగదు, మూడు సెల్ ఫోన్లును స్వాధీనం చేసుకున్నామన్నారు. లే-అవుట్లో కొంతమంది వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లుగా వచ్చిన సమాచారంతో యాంటీ గంజాయి టీమ్‌తో కలిసి దాడులు చేసి గంజాయి సేవిస్తూ, విక్రయాలకు పాల్పడుతున్న ఒక జువినల్‌తో సహా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. జామి మండలం అలమండకు చెందిన దాసరి గాంధీ గంజాయిని విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. డెంకాడ మండలం బెల్లాం గ్రామానికి చెందిన జుతిక శ్యామ్, మల్లాపురెడ్డి రాకేష్, దిబ్బగుడ్డి గ్రామానికి చెందిన మల్లాపురెడ్డి వేణుతో సహా మిగతా వారు జ్యువినల్ గంజాయిని సేవిస్తున్నట్లుగా విచారణలో వెల్లడైందన్నారు. గంజాయి విక్రయాలు జరిపిన వ్యక్తితోసహా, గంజాయి సేవించిన మరో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసామని తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి, రామభద్రపురం

గ్రామీణ ప్రాంతాల్లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఒ వెంకటయ్య హెచ్చరించారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నకిలీ పత్తి విత్తనాలు అమ్మే వ్యాపారులపై నిఘా పెట్టామన్నారు. ఏ ఒక్క రైతు హెచ్‌టి పత్తి విత్తనాలు సాగుచేయరాదన్నారు. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అప్పటికీ రైతులు ఈ విత్తనాలు సాగుచేసినట్టు తమ దృష్టికి వస్తే వంట ఏ సమయంలో ఉన్నా ట్రాక్టర్‌తో దున్నించడంతోపాటు పెట్రోల్ పోసి తగలబెడతామని హెచ్చరించారు. లైసెన్సు డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బిల్లులు, విత్తనాల సంచులు పంట కాలమయ్యేటప్పటి వరకు ఉంచుకోవాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి విత్తనాలు పోసే ముందు రైతులు మొలకశాతం నిర్ధారించుకోవాలన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధంచి 1352 వరి విత్తనాల బస్తాలను సిద్ధంగా ఉంచామని, కెజీకి రూ.5 సబ్సీడీ అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరో 150 క్వింటాళ్ళ వరి విత్తనాలు అదనంగా తెప్పించడానిక చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఎఇఒ సునీత పాల్గొన్నారు.